

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - కడప

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను సోమవారం సభాభవన్‌లో నిర్వహి ంచనున్నట్లు డిఆర్ఒ విశ్వేశ్వర నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో కూడా సమర్పిం చవచ్చునని తెలిపారు.

డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని ఉదయం 9.30 నుండి 10 గంటల వరకు నిర్వహిస్తామని ప్రజలు 08562-244437 నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చు అని తెలిపారు.

బడిబస్సు భద్రమేనా?



- జిల్లాలో 900కుపైగా ప్రయివేట్ పాఠశాలల బస్సులు
- అన్నీ సక్రమంగానే ఉన్నాయంటున్న అధికారులు
- ఇంకా ఫిట్‌నెస్ పరీక్షకు హాజరు కాని బస్సులు
- కాలం చెల్లిన బస్సులతోనే నెట్టుకొస్తున్న కొన్ని స్కూళ్ల యాజమాన్యాలు
- అనుభవంలేని, వేగ నియంత్రణ పాటించని డ్రైవర్లు
- చిన్నారుల భద్రత అగమ్యగోచరం
- అధికారులు చర్యలు చేపట్టాలని తల్లిదండ్రుల వేడుకోలు

ప్రజాశక్తి - పులివెందులటౌన్

జిల్లాలో ఉన్న ప్రయివేట్, కార్పొరేట్ విద్యా సంస్థలకు సంబంధించిన బస్సులకు భద్రత కరువైంది. కడప, ప్రొద్దుటూరు, బద్వేలు, పులివెందుల రవాణాశాఖ కార్యాలయాల పరిధిలో సుమారు 950 పాఠశాలల, కళాశాలల బస్సులున్నాయి. నిబంధనల ప్రకారం వేసవి సెలవుల్లోనే వీటి ఎఫ్‌సి చేయాల్సి ఉంది. కొంతమంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో విద్యార్థుల ప్రాణాలకు ముప్పు వాటిల్లనుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో తిరిగే బడి బస్సులు నిబంధనలు పాటించడం లేదు. ఇప్పటి వరకు ఎన్ని బస్సులు ఎఫ్‌సిలు అయ్యాయనే విషయం కూడా తెలియకపోవడం గమనార్హం. వీటిలో కొన్ని కొత్తవి ఉండగా.. చాలా వరకు పాతవే ఉన్నాయి. కొన్ని పాఠశాలలైతే ఇతర రాష్ట్రాల్లో స్క్రాప్ కింద వదిలేసిన బస్సులను తీసుకువచ్చి ఇక్కడ నడుపుతున్నట్లు సమాచారం. వీటికి సంబంధించి మే నెలాఖరు కల్లా ఫిట్ నెస్ టెస్ట్ పాస్ కావాల్సిఉంది. అయితే కొన్ని విద్యా సంస్థలు పద్ధతి ప్రకారం భద్రత పరీక్షలు నిర్వహించి ఫిట్‌గా బస్సులను నడుపుతున్నారు. మరికొన్ని విద్యా సంస్థలు మాత్రం పైసలు మిగులుతాయన్న ఉద్దేశంతో సరిగా లేని బస్సులను సైతం నడుపుతూ పిల్లల ప్రాణాలను గాలిలో దీపాల్లా మార్చేశారు. కొన్ని విద్యా సంస్థల్లో అనుభవం లేని డ్రైవర్ల కారణంగా ప్రమాదాలు చోటు చేసుకున్న సందర్భాలూ ఉన్నాయి. రవాణా శాఖ అధికారులు ఫిటినెస్ టెస్టుకు రాని బస్సులను గుర్తించి వాటిపై చర్యలు చేపట్టి చిన్నారుల ప్రాణాలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత కలిగి ఉన్నారు. ప్రస్తుత కాలంలో ప్రజలు వారి పిల్లల విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. చదువు బాగా చెబుతారనే పేరు ఉంటే సుదూర ప్రాంతాలకు సైతం తమ పిల్లలను పంపుతూ వారి ఆదాయంలో సింహ భాగాన్ని విద్యాసంస్థలకు చెల్లిస్తున్నారు. రోజూ పిల్లలను స్కూళ్లకు తీసుకువెళ్లి తిరిగి ఇంటికి తీసుకొచ్చే బడి బస్సులు వేసవి సెలవుల అనంతరం పిల్లలను రోజూ తీసుకువెళ్తున్నాయి. ఈ నెల 12 నుంచి జిల్లాలో అన్ని ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రారంభమైన నేపథ్యంలో బడి బస్సుల ఫిట్ నెస్‌పై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తల్లిదండ్రులు ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నప్పటికీ ప్రతి సంవత్సరం బస్సు ప్రమాదాల సంఖ్య పెరుగుతూనే వస్తుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పెద్దలు అన్ని జిల్లాల రవాణా శాఖ అధికారులను బడి బస్సుల భద్రతపై అప్రమత్తం చేశారు. మే చివరి నాటికే బడి బస్సుల ఫిట్‌నెస్ పరీక్షలు చేయవలసి ఉన్నప్పటికీ జిల్లాలో ఇప్పటికీ ఇంకా చాలా ప్రయివేట్ విద్యాసంస్థల బస్సులు రవాణా శాఖ నుంచి ఫిట్ నెస్ సర్టిఫికెట్‌ను పొందలేదు. జిల్లా వ్యాప్తంగా వెయ్యికి పైగా బస్సులు వివిధ పాఠశాలలకు, కళాశాలలకు తిరుగుతున్నట్లు అధికారిక లెక్కలు చూపుతున్నాయి. ఇప్పటికీ అనేక పాఠశాలల యాజమాన్యాలు కాలం చెల్లిన బస్సులతోనే ప్రయాణం కొనసాగిస్తున్నారు.



ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోని బస్సులపై చర్యలు తీసుకోవాలి

బస్సుల భద్రతపై అధికార యంత్రాంగం కచ్చితంగా నిబంధనలు పాటించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులకు వినియోగిస్తున్న బస్సులను రవాణా శాఖ అధికారులతో ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ను పొందవలసి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం 15 సంవత్సరాలు నిండిన బస్సులు పాఠశాలలకు వినియోగించరాదని పూర్తిస్థాయిలో నిషేధం జరిగింది. పాఠశాలలకు వినియోగించే బస్సుల వేగ నియంత్రణపై కూడా విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో 40 కిలోమీటర్ల నుంచి 60 కిలోమీటర్ల వేగంతోనే నడపాలని నిబంధనలు విధించారు. అయినప్పటికీ ఆయా పాఠశాలల బస్సులు నడిపే డ్రైవర్లు కొన్ని సందర్భాలలో 80 కిలోమీటర్ల వేగంతో నడుపుతూ ఉంటారు. అదే సందర్భంలో పాఠశాలల బస్సులు నడిపే డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణ అవసరం. విద్యార్థులు కాబోయే బావి భారత పౌరులు వారిని ఇంటి వద్ద నుండి పాఠశాలకు, పాఠశాల నుండి ఇంటి వద్దకు సురక్షితంగా చేర్చాల్సిన డ్రైవర్లు ఎటువంటి వ్యసనాలకు లోను కాకుండా బాధ్యతాయుతంగా రవాణా చేయవలసి ఉంటుంది. ఇప్పటికైనా రవాణా శాఖ అధికారులు పాఠశాలలకు వినియోగించే బడి బస్సుల భద్రతపై ముమ్మర తనిఖీలు చేపట్టి, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా భద్రత ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లితండ్రులు కోరుతున్నారు. బడి బస్సులు నడిపే డ్రైవర్లకు, ఆ పాఠశాలల యాజమాన్యాలకు శిక్షణతో పాటు కౌన్సెలింగ్ నిర్వహించాలని కోరుతున్నారు.

పాఠశాలల బస్సులపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో పాఠశాలలకు వినియోగించే బస్సుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించి నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నామని, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని రవాణా శాఖ జిల్లా అధికారులు తెలిపారు. జిల్లాలో దాదాపు 900 బస్సులు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు వినియోగించటం జరుగుతుందని, ఇప్పటివరకు 75 శాతం వరకు బస్సులు ఫిట్ నెస్ ధ్రువీకరణ పత్రాలు పొందారని, మరో 25 శాతం బస్సులు ఫిట్ నెస్‌కు రావాల్సి ఉందని స్పష్టం చేశారు. 15 సంవత్సరాలు నిండిన బస్సులను పాఠశాలలకు తిరగటానికి పూర్తిగా నిషేధించడం జరిగిందని స్పష్టం చేశారు. జిల్లాలో పాఠశాలల బస్సుల డ్రైవర్లకు ఒకరోజు శిక్షణ, అవగాహన తరగతులు నిర్వహించామని, ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు సంబంధించి డ్రైవర్లు ఈ శిక్షణ అవగాహన కార్యక్రమంలో పాల్గొనడం జరిగిందని తెలిపారు. ఎప్పటికప్పుడూ పాఠశాలల యాజమాన్యాలకు బస్సుల భద్రతపై అవగాహన కల్పిస్తున్నామని ఈ సందర్భంగా వారు తెలియజేశారు.

ప్రైవేట్ పాఠశాలల బస్సులు

విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలి

ఇంటింటికీ పోస్టర్లను అంటించిన సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - బద్వేలు

స్థానిక సిపిఎం సుమిత్రానగర్ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు స్మార్ట్ మీటర్ల బిగింపును తక్షణమే ఆపాలని ఆదివారం సిపిఎం రాష్ట్ర కమిటీ ముద్రించిన పోస్టర్లను ఇంటింటికి వెళ్లి అంటించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు ముడియం చిన్ని మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి నేతలు విద్యుత్ ఛార్జీలు పెంచబోమని, స్మార్ట్ మీటర్లు బిగించబోమని ఇచ్చిన హామీ అమలుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. లోకేష్ పాదయాత్రలో స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని ఇచ్చిన పిలుపును మరిచిపోయారా అని ఆయన ప్రశ్నించారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రజలపై రెండుసార్లు విద్యుత్ ఛార్జీల భారం దాదాపు రూ.15,454 కోట్లు మోపారని, ఇది దుర్మార్గమని,సెకి ఒప్పందాన్ని రద్దు చేయడానికి అవసరమైన క్లాజు ఉందని విద్యుత్ రంగ నిపుణులు చెబుతున్నా దాన్ని పరిగణలోకి తీసుకోకపోవడం సరైంది కాదన్నారు. ట్రూ అప్ ఛార్జీలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల బిగింపు ఆపాలని, సెకి ఒప్పందాన్ని రద్దు చేయాలని, టైమ్ ఆఫ్ డే విధానాన్ని ఉపసంహరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు షేక్ మస్తాన్ షరీఫ్, శాఖ కార్యదర్శులు షేక్ ఆదిల్, ముడమాల ఓబుల్ రెడ్డి పాల్గొన్నారు.



స్టిక్కర్లు అంటిస్తున్న సిపిఎం నాయకులు

వేమన పద్యం ప్రాంతాలు, భాషలకు అతీతమైంది



రమేష్‌ను సన్మానిస్తున్న అతిథులు

ప్రజాశక్తి కడప అర్బన్

వేమన నిజమైన ప్రజాకవి అని, అందువల్లనే ఆయన పద్యం కులాలను, మతాలను, ప్రాంతాలను, భాషలను దాటి విస్తరించిందని తెలుగు భాషా సేవకులు .రమేష్ (శ్రీకాళహస్తి) అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నిర్వహిస్తున్న 'నెలనెలా సీమ సాహిత్యం' కార్యక్రమంలో భాగంగా ఆదివారం బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో 144వ సదస్సు నిర్వహించారు. 'సజీవ సంప్రదాయంగా వేమన' అనే అంశంపై తెలుగు భాషా సేవకులు స.వెం.రమేష్ ప్రసంగించారు. వేమన పద్యం ఏ భాషకూ లేనంత గొప్పతనాన్ని తెలుగు భాషకు కలిగించిందన్నారు. తమిళకవి తిరువళ్ల వర్‌తోనూ, కన్నడకవి సర్వజ్ఞునితోనూ వేమనను పోలుస్తుంటారని, సమాజంలో మంచిని పెంచి, చెడును తుంచే విషయంలో ఆ ముగ్గురికీ పోలిక ఉన్నమాట వాస్తవమే అయినప్పటికీ వీళ్ళకన్నా వేమనే గొప్పవాడని అన్నారు. తిరువళ్ళువర్‌ను తమిళ ప్రభుత్వాలు పట్టించుకుని ప్రచారం చేయడంవల్ల ఆయన రాసిన కురుళ్లు కొంత వాడుకలోకి వచ్చినప్పటికీ, చదువుకున్న తమిళ ప్రజల నాలుకలపైన మాత్రమే ఆయన నానుతున్నాడన్నారు. అదేవిధంగా సర్వజ్ఞుడు కర్ణాటకలో కొంత సామాన్య జనంలోకి పోయినప్పటికీ ఆయన పరిధి కూడా చాలా పరిమితమని, వేమన అలా కాక కులాలను, మతాలను, ప్రాంతాలను, భాషలను దాటి దూసుకుపోయాడన్నారు. తెలుగువాళ్ళు బతుకు పోరాటంలో ఇతర ప్రాంతాలకు వలస వెళ్ళినప్పుడు వాళ్ళ నోళ్ళల్లో నానుతున్న వేమన పద్యాలు కూడా వాళ్ళతోపాటు వెళ్ళిపోయి తరాలు మారినప్పటికీ కాలానుగుణంగా వాళ్ళ సంప్రదాయాల్లో కూడా నిలిచిపోయాయన్నారు. వేమన వేసిన అడుగు చాలా పెద్దదని, నిచ్చెనమెట్ల కుల సమాజంలో అట్టడుగున ఉన్న ఆశ్రిత కులాల గుండెల్లో కూడా గూడు కట్టుకోవడం ఆయన ప్రత్యేకత అన్నారు. వేమన తెలుగంటే ఏమిటో తెలియని, తెలుగు పేరైనా వినని కొన్ని జాతుల నాలుకలకు ప్రాణమైనాడన్నారు. కార్యక్రమాన్ని డాక్టర్ చింతకుంట శివారెడ్డి, డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి సమన్వయం చేశారు. ప్రారంభంలో వక్త స.వెం.రమేశ్‌ను యోగి వేమన విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు జి.శివారెడ్డి, పాలకమండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, గ్రంథాలయ సహాయకులు ఎన్ .రమేశ్‌రావు, జి.హరిభూషణరావు, జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకటరమణ, ఎం.మౌనిక, సిబ్బంది, పాఠకులు కలసి శాలువతో సత్కరించారు. కార్యక్రమంలోఎన్.విజయానందరెడ్డి, డాక్టర్ పెద్దిరెడ్డి నీలవేణి, డాక్టర్ ఎస్.రాజగోపాలరెడ్డి, భూపతి రాయల్, రమేశ్, కొత్తపల్లె రామాంజనేయులు, సాయిబాబా, తేజ, మహేష్, దక్షిణామూర్తి, విజయకుమార్, శాంతారామ్, శ్యామసుందర్ రెడ్డి, రామమోహన్ రెడ్డి, పల్లె విజయ్, శ్రీనివాసులు, సాయికుమార్ పాల్గొన్నారు.

పారదర్శకతకు పెద్దపీట

ప్రభుత్వ నిబంధనల ప్రకారమే బదిలీలు
ఫేక్ సర్టిఫికెట్ దారులకు షోకాజ్ నోటీసులు
వైద్యఆరోగ్యశాఖ రీజినల్ డైరెక్టర్ బి.రామగిడ్డయ్య వెల్లడి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి



ముఖాముఖి..

నర్సింగ్ బదిలీలు, ఉద్యోగోన్నతులు, రిక్రూట్‌మెంట్ అంశాల్లో పారదర్శకతకు పెద్దపీట వేశాం. ఇటీవలి బదిలీల్లో 1300 మంది పారా మెడికల్ ఉద్యోగుల బదిలీల్లో ఎలాంటి పొరపాట్లకు తావు లేదు. రీజియన్ పరిధిలో వైద్య సేవల్లో మెరుగుదలకు కృషి చేస్తున్నాం. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు మెరుగైన వైద్యసేవలతో ముందుకెళ్లే విధంగా నియామకాలు చేపడుతున్నాం. భవిష్యత్ రిక్రూట మెంట్‌ల్లో దరఖాస్తుదారుల సర్టిఫికెట్లను యూనివర్శిటీ ఉన్నతాధికారుల పరిశీలన అనంతరం పారదర్శకంగా నియామకాలు చేపడతామని పేర్కొంటున్న వైద్యఆరోగ్యశాఖ రీజినల్ డైరెక్టర్ బి.రామగిడ్డయ్యతో ముఖాముఖి...

వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల వివరాలు తెలపండి?

జోన్-4 పరిధిలో కడప, అన్నమయ్య, అనంతపురం, సత్య సాయి, కర్నూలు, నంద్యాల, తిరుపతి, చిత్తూరు జిల్లాల పరిధిలో 3, 833 మంది ఉద్యోగులు ఉన్నారు. ఇందులో ఎంపిహెచ్ఇఒ, ఎంపి హెచ్ఎస్, హెచ్ఇసి, ఎంఎల్‌హెచ్‌పి, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, తాజాగా ఫార్మసిస్టులను కూడా కలపడంతో విస్తృతి పెరిగింది. వీరందరి సర్వీసులు, రిక్రూట్‌మెంట్లు, బదిలీలు, వైద్య ఆరోగ్యానికి సంబంధిత స్కీముల అమలు తీరును పరిశీలన చేయాల్సి ఉంటుంది.

ఇటీవలి బదిలీల గురించి మాట్లాడండి?

జోన్-4 పరిధిలో 22 కేడర్ల పరిధిలోని 1,300 మంది పారా మెడికల్ ఉద్యోగులను బదిలీ చేయడమైంది. రాష్ట్రప్రభుత్వ నిబంధనల మేరకు స్పౌజ్, అనారోగ్య పరిస్థితులు, యూనియన్ సభ్యులు వంటి అంశాలను పరిగణలోకి తీసుకుని సాధ్యమైన మేరకు పకడ్బందీగా చేపట్టడమైంది.

నకిలీ సర్టిఫికెట్ల నివారణ చర్యలేమిటి?

జోన్-4లో నర్సింగ్ నియామకాల్లో నకిలీ సర్టిఫికెట్ల బెడద నివారణపై సీరియస్‌గా దృష్టి సారించాం. దరఖాస్తుల స్క్రీనింగ్ అనంతరం నిర్వహించనున్న కౌన్సెలింగ్‌లో అర్హత సాధించిన అభ్యర్థి సర్టిఫికెట్లను ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్శిటీ ఉన్నతాధికారుల సహకారం తీసుకున్నాం. ఇందులో 26 మంది నకిలీ దరఖాస్తుదారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయడమైంది. సంబంధిత యూనివర్శిటీ అధికారులు సర్టిఫై చేసిన అనంతరం నియామకాలు చేపడతాం.

దీర్ఘకాలిక రోగుల వైద్యసేవలను వివరించండి?

క్రానిక్ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి అవకాశం ఉంది. దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడి జీవితాల్ని అతి కష్టంగా లాగుకొస్తున్న వారి పట్ల జాగ్రత్తలు తీసుకోవడంలో భాగంగా నియామకాలు చేపడతాం. ప్రతి పిహెచ్‌సి పరిధిలో 172 రకా ల మందులను అందుబాటులో ఉంచుతాం. గుండె సంబంధిత వ్యా ధుల మందులను సైతం అవసరమైన మేరకు అందుబాటులో ఉంచే ప్రయత్నం జరుగుతోంది.

డిడి పోస్టు కొరతపై ఏమంటారు?

జోన్-4 పరిధిలోని ఉమ్మడి రాయలసీమ జిల్లాలకు చెందిన నియామకాలు, బదిలీలు, ప్రమోషన్ల వ్యవహారం కష్టంతో కూడుకున్న వ్యవహారం. డిడి ఆఫీసర్‌ను నియమిస్తే భారం తగ్గుతుంది. దీంతో మరింత పారదర్శకంగా పని చేయడానికి అవకాశం ఉంటుంది.

ఆర్‌డి ఆఫీస్ అధ్వాన్నత గురించి మాట్లాడడండి?

ఆర్‌డి కార్యాలయం మౌలిక వసతుల కొరతను ఎదుర్కొంటున్న మాట వాస్తవమే. తాగునీరు, ఎలక్ట్రికల్, వాహనం సదుపాయం, రిక్రూట్‌మెంట్ సమయాల్లో ఎనిమిది జిల్లాల నుంచి వచ్చిన ఉద్యోగులకు, అభ్యర్థులకు సరైన మరుగుదొడ్లు ఇతర సదుపాయాల కొరత ఇబ్బంది పెడుతోంది. దీని నివారణపై దృష్టి సారించాం. జిజిహెచ్, కలెక్టరేట్ వంటి ప్రాంతాల్లో గదుల కొరత అన్వేషించడ మైంది.

మీడియాపై దాడి హేయం

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రజాస్వామ్యంలో నాలుగవ స్తంభంగా ఉన్న మీడియాపై దాడి చేయడం హేయనీయమని వివిధ పార్టీల నాయకులు, జర్నలిస్ట్ యూనియన్ నాయకులు అన్నారు. ఆదివారం మహా న్యూస్ ఛానల్ పై దాడికి నిరసనగా ప్రెస్ క్లబ్ నుంచి కొత్త బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ చేపట్టారు. జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ దాడి చేసిన, దాడిచేయించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి దాడులు జర్నలిస్టుపై మరలా చోటు చేసుకోకుండా చూడాలని తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కడప జిల్లా అధ్యక్షులు మాదాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలన్నారు. కార్యక్రమంలో దాడులు, దౌర్జన్యాల కమిటీ మాజీ కన్వీనర్ మామిడి ఎల్లారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు సురేంద్ర, కార్యదర్శి నాగేష్, యూనియన్ నాయకులు, కడప జర్నలిస్టులు, వివిధ సంఘాల స్టూడెంట్ నాయకులు, రాజకీయపార్టీల నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా నిలిచే మీడియాపై దాడి హేయమైన చర్యని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా ఉన్న మీడియాపై తరచూ దేశంలో, రాష్ట్రాలలో ఏదో ఒక సందర్భాలలో దాడులు జరుగుతూనే ఉన్నాయని పేర్కొన్నారు. తెలంగాణలో మహా న్యూస్ కార్యాలయంపై బిఆర్ఎస్ నాయకులు దాడి చేయడానికి ఖండిస్తున్నామని తెలిపారు. ప్రజా సమస్యలను వెలికి తీయడంలో, ప్రభుత్వాలకు తెలియజేయడంలో మీడియా కీలక భూమిక పోషిస్తుందని పేర్కొన్నారు. ఇటువంటి సందర్భంలో ఏవైనా సమస్యలు వస్తే వాటిని ఇతర రూపంలో ముందుకు వెళ్లాలి కానీ ఇలా బహిరంగంగా దాడులకు తెగబడడం హేయమైనా చర్య అని తెలిపారు. జర్నలిస్టుల రక్షణ చట్టం తీసు కురావాలని తెలిపారు. తెలంగాణలో మహా న్యూస్ కార్యాలయం పై దాడికి పాల్పడిన బిఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని పేర్కొన్నారు.

హైదరాబాద్ మహా న్యూస్ కార్యాలయం మీద బిఆర్ఎస్ పార్టీ దుండగులు చేసిన దాడి దుర్మార్గమని డిసిసి అధ్యక్షులు విజయజ్యోతి పేర్కొన్నారు. ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడారు. పత్రికలు, న్యూస్ ఛానళ్లపై జరుగుతున్న పరిణామళానే వార్తల రూపంలో ప్రజలకు తెలియజేప్పే బాధ్యత తీసుకుంటాయన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని సిబిఐకి అప్ప గించి బి ఆర్ ఎస్ నాయకులను చట్ట ప్రకారం చర్య తీసుకో వలసిందిగా కోరారు.

తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాదులో ఇటీవల మహా టీవీ న్యూస్ ఛానల్ ప్రధాన కార్యాలయం పై భారత్ రాష్ట్ర సమితి పార్టీకి చెందిన గూం డాలు దాడి చేయడం అమానుషమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ విమర్శించారు. కడపలో ఆదివారం జర్నలిస్టు సంఘాలు నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న అనంతరం ఆయన మాట్లాడారు. దాడి పూర్తిగా మీడియా స్వేచ్ఛపై దాడిగా పేర్కొన్నారు. ఇందుకు బాధ్యులైన టిఆర్ఎస్ అధిపతులు కే. చంద్రశేఖర రావు, కే.రామారావు లు పూర్తిగా బాధ్యత వహించాలని హెచ్చరించారు. **వేంపల్లె** : హైదరాబాద్‌లో మహా టివి ఛానల్ ప్రధాన కార్యా లయంపై కొందరు బిఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు భౌతికంగా దాడి చేయడం, వాహనాలు, సామగ్రి ధ్వంసం చేయడం, సిబ్బందిని గాయపరచడం అప్రజాస్వామికమని పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి ఖండించారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మహ టివి కార్యాలయంపై దాడి చేసిన నిందితులపై తెలంగాణా ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



అంబేద్కర్ సర్కిల్ వద్ద ఆందోళన చేస్తున్న జర్నలిస్టులు, నాయకులు

కుక్కలను నియంత్రించడంలో విఫలం

ప్రజాశక్తి - బద్వేలు : కుక్కలను నియంత్రించడంలో బద్వేల్ మున్సిపాలిటీ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ఆవాజ్ జిల్లా అధ్యక్షులు చాన్‌బాషా పేర్కొన్నారు. పట్టణంలోని ఆవాజ్ కమిటీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆవాజ్ కమిటీ జిల్లా అధ్యక్షులు పి . చాంద్ బాషా , బద్వేల్ పట్టణ ఆవాజ్ కమిటీ అధ్యక్షులు ఎస్ .అబ్దుల్ సత్తాం మాట్లాడుతూ బద్వేల్ పట్టణంలో రోజురోజుకూ కుక్కల బెడద అధికమయ్యాయని చెప్పారు. ప్రజలను దాడులు చేసి గాయపరుస్తున్నాయని పేర్కొన్నారు. వాటిని నియంత్రించడంలో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ఆదివారం అబ్బరాతివీధిలో ఓ చిన్నారి పై పిచ్చి కుక్క దాడి చేసి ముఖంపై తీవ్ర గాయాలయ్యాయని పేర్కొన్నారు. పట్టణంలో చిన్నారులు వీధిలో తిరగాలన్నా, స్కూళ్లకు వెళ్లాలన్నా భయాందోళనకు గురవుతున్నారన్నారు. గాయపడిన వారు రోజూ ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ వైద్యం చేయిం చుకుంటున్నారని తెలిపారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు కుక్కల బెడదను నివారించాలని కోరారు. లేని పక్షంలో ప్రజలందరినీ ఏకం చేసి మున్సిపల్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో ఆవాజ్ నాయకులు బాషా, నాగూర్ పాల్గొన్నారు.

స్థలాన్ని ఆక్రమించారు.. న్యాయం చేయండి

ప్రజాశక్తి - కడప అర్బన్

సికె దిన్నె మండలం, బుగ్గలేటి పల్లెలో ఉన్న సర్వేనెంబర్ 54/1సిలో 2.95 ఎకరాల భూమిలో 50 సెంట్లు ఆక్రమించారని, తనకు అధికారులు న్యాయం చేయాలని బాధితుడు బి.ఈశ్వర రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 54/1సిలో 27 సెంట్లు, 54/2సి లో 50 సెంట్లు కలిపి 77 సెంట్లు వెంకట సుబ్బారెడ్డికి 20 ఏళ్ల కిందట తనకు అమ్మినట్లు తెలిపారు. కొందరు అక్రమార్కులు కొనుగోలు చేసిన ప్రాంతంలో కాకుండా రోడ్డుకు దగ్గరగా ఉన్న 50 సెంట్లు భూమిలో ఫినిషింగ్ వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఎస్‌పిని కలిశామని ఆయన సికె దిన్నె పోలీస్ స్టేషన్ కు రెఫర్ చేశారని చెప్పారు. తమకు న్యాయం చేయాలనికోరారు. సమావేశంలో బి.మల్లికార్జునరెడ్డి, పి.ఈశ్వర్‌రెడ్డి, వీరమ్మ, నాగమునెమ్మ పాల్గొన్నారు.

రేపటి నుంచి యోగా బ్యాచ్ ప్రారంభం

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని పటేల్ రోడ్డు ఉన్న మిత్ర యోగా సెంటర్‌లో 30 రోజుల పాటు నిర్వహించే యోగా శిక్షణ కొత్త బ్యాచ్‌ను జుల 1 నుంచి ప్రారంభిస్తున్నట్లు యోగా నిపుణులు డాక్టర్ కల్పన, డాక్టర్ రంగనాథ రెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. శిక్షణ ఉదయం 5.45 గంటల నుంచి 7.00 గంటల వరకు మొదటి బ్యాచ్, ఉదయం 8.30 గంటల నుంచి 10 గంటల వరకు మహిళలకు రెండో బ్యాచ్ ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు 9848861206, 7013238986 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.



రవికుమార్‌ను సన్మానిస్తున్న రాష్ట్ర అధ్యక్షులు ఆర్. సూర్యనారాయణ

విధుల్లో ఎలాంటి మచ్చ లేకుండా పనిచేశా

- ఎపి టిఎస్ఎ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు రవికుమార్

ప్రజాశక్తి - కడప అర్బన్

సుదీర్ఘ ఉద్యోగ విధుల్లో ఎలాంటి మచ్చ లేకుండా పనిచేయడం సంతోషంగా ఉందని ఎపి టిఎస్ఎ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు రవికుమార్ పేర్కొన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లోనిని ప్రజా సమస్యల పరిష్కార వేదిక సమావేశ మందిరంలో ఉద్యో విరమణ సందర్భంగా సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ స్నేహితుల సలహా మేరకు రిటైర్మెంట్ ఫంక్షన్ ఒకరోజు ముందే నిర్వహించుకుంటున్నానని చెప్పారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి చార్జి మెమోలు తీసుకోకుండా పనిచేశానని తెలిపారు. చిన్న తప్పు చేసిన పెద్ద పనిష్మెంట్ ఉంటుందని, అలాంటి తప్పు చేయకుండా రిటైర్డ్ అవడం సంతోషంగా ఉందని చెప్పారు. ఇంతటి విజయానికి తన భార్య శాంతమ్మ సహకారం ఉందని పేర్కొన్నారు. గతంలో ఎమ్మెల్యేగా తనకు ఆఫర్ వచ్చిందని పేర్కొన్నారు. ఉద్యోగాన్ని పరమావధిగా భావించి విధుల్లో కొనసాగానని తెలిపారు. భవిష్యత్తులో అవకాశం వస్తే పోటీ చేస్తానని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.సూర్యనారాయణ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరామని చెప్పారు. కార్యక్రమంలో ఎపి జిఇఎ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ కుమార్, జిల్లా అధ్యక్షులు రఘురామనాయుడు, వివిధ యూనియన్ల నాయకులు, ఉద్యోగులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

డాక్టర్ జమాల్‌బాషాకు సన్మానం

ప్రజాశక్తి - కడప అర్బన్

మలేరియా జోనల్ ఆఫీసర్ డాక్టర్ జమాల్ బాషాను డాక్టర్స్ డే సందర్భంగా టిడిపి నగర ఉపాధ్యక్షులు కొండా సుబ్బయ్య ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ జమాల్ బాషా తన వద్దకు ఎవరు వచ్చినా వారిని ఎంతో ప్రేమగా పలకరించి ఆరోగ్యం పై తగు సూచనలు, సలహాలిచ్చి సేవలు అందిస్తున్నారని తెలిపారు. జమాల్ బాషా సేవల అభినందనీయమని చెప్పారు. కార్యక్రమంలో కరీముల్లా, ఇలియాస్, కరీం పాల్గొన్నారు.



ప్రతిభ సాధించిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

రాణితిరుమలదేవి డిగ్రీ కళాశాల విద్యార్థుల విజయభేరి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

మైదుకూరు రోడ్డులోని రాణి తిరుమల దేవి కాలేజ్ ఆఫ్ సైన్సెస్ విద్యార్థులు యోగి వేమన యూనివర్సిటీ ఏప్రిల్, మే నెలలో నిర్వహించిన 2,4,6, డిగ్రీ హానర్స్ పరీక్ష ఫలితాలలో చక్కటి ప్రతిభ కనపరిచి యూనివర్సిటీ స్థాయిలో అత్యధిక జీపీఏ పాయింట్స్ సాధించారని కళాశాల కస్పాండెంట్ ఎల్.తరుణేంద్ర శేఖర్, ప్రిన్సిపల్ టి.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మూడో సంవత్సరం బీఎస్సీ బయోటెక్నాలజీ హానర్స్‌లో కెఎస్ రోషన్ 10 /10, వైవి స్రవంతి 10/10, మూడో సంవత్సరం బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ హానర్స్‌లో బి.సువర్ణ 10/ 10, ఫైజా 10/ 10 మూడో సంవత్సరం బీకాం కంప్యూటర్ అప్లికేషన్ హానర్స్‌లో ఏ.చంద్రకళ 10/10, రోస్ నా నౌరిన్ 10/10 సాధించారన్నారు. రెండవ సంవత్సరం నాలుగవ సెమిస్టర్‌లో బిఎస్సి బయోటెక్నాలజీ హానర్స్ లో ఏ.వైష్ణవి 10/10, బి సెరీన మహబూబ్ 9.85, రెండవ సంవత్సరం నాలుగవ సెమిస్టర్ బిఎస్సి కంప్యూటర్ సైన్స్ హానర్స్‌లో ఎం.వీర భార్గవి 9.45, జి.అశ్విని 9.3, రెండవ సంవత్సరం నాలుగో సెమిస్టర్ బీకాం కంప్యూటర్ అప్లికేషన్ హానర్స్‌లో ఎస్ గౌసియా 9.2, బి చౌడేశ్వరి 9.1, మొదటి సంవత్సరం రెండవ సెమిస్టర్ బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ హానర్స్‌లో ఏ శైలజ 9.25, ఎం.హర్షిత 9.42, మొదటి సంవత్సరం సెకండ్ సెమిస్టర్ బయోటెక్ హానర్స్‌లో కే లావణ్య 9.25, ఎన్ స్నేహ 9.25, మొదటి సంవత్సరం సెకండ్ బికాం కంప్యూటర్ అప్లికేషన్ హానర్స్ లో ఏం రాణి 9.42, ఎస్బి రాహిన్ 9.17 జిపిఏ సాధించారు. ఇంతటి మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కరెస్పాండెంట్ ఎల్.తరుణేంద్ర శేఖర్ ప్రిన్సిపల్ టీ.చంద్రశేఖర్‌రెడ్డి ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఎన్‌ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్.వెంకటేశ్వర రెడ్డి, అధ్యాపకులు అధ్యాపకేతర బృందం అభినందించారు.



ప్రతిభ చూపిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

సత్తా చాటిన ఎస్‌విడిసి విద్యార్థులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలోని శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాల విద్యార్థులు 7 మంది 10కి 10 జీపిఏతో సత్తా చాటారని కళాశాల కరస్పాండెంట్ హరినారాయణ తెలిపారు. 4వ సెమిస్టర్ ఫలితాలలో 10 జిపిఏకు గానూ బిఎస్సీ జువాలజీ గ్రూప్‌లో తేజస్విని, లక్ష్మీ లాలస, మంజులత 10, తస్లీమ్, చందన 9.7, బిఎస్సీ బయోటెక్నాలజీలో జ్ఞానశ్రీ 10, తన్మయ 9.7, శ్రావణి, ఫర్హా 9.55, బిసిఏలో హర్షిత 9.65, ఆయేషా 9.25, యాస్మిన్, ప్రవల్లిక 9.20, బిఎస్సీ కంప్యూటర్ సైన్స్‌లో లక్ష్మీప్రసన్న 9.65, శ్రీప్రియ 9.15, బికాం కంప్యూటర్స్ విభాగంలో హసీనా 9.30, హసీనా, పరిమళ 9.10, 2వ సెమిస్టర్ ఫలితాలలో 10 జీపిఏకుగానూ బిఎస్సీ జూవాలజీలో సబీనా, ముష్కాన్ 10, సహనా, గౌసియా, సుప్రియ 9.75, బిఎస్సీ బయోటెక్నాలజీలో బ్లెసీనా 9.56, బిఎస్సీ కంప్యూటర్ సైన్స్‌లో దీవెన, నాగ రచన 8.92, బిసిఏ విభాగంలో నాగశ్వేత 8.92, గంగా హరిత 8.75, బిబిఏ గ్రూప్‌లో లక్ష్మీ ప్రవల్లిక 9.33, బికాం కంప్యూటర్స్ విభాగంలో హారిక 9.08, సాయి వైష్ణవి 8.83 జీపిఏ సాధించారని వివరించారు. ఈ సందర్భంగా ఆదివారం కళాశాలలో కరస్పాండెంట్‌తోపాటు డైరెక్టర్ పృథ్వీ నారాయణ, వైస్ ప్రిన్సిపల్ శారదా భవాని, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ రామమోహన్, అధ్యాపకులు గౌరీ శంకర్, మౌనయ్య, అజ్రా, గంగా భవాని అభినందించారు.

పశువులకు బీమా సౌకర్యం : ఎఒ

ప్రజాశక్తి - చాపాడు

రైతులు పశువుల బీమాను సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి మహమ్మద్ గౌస్ సూచించారు. రూ.30వేలు విలువ చేసే పశువుకు రైతు వాటాగా రూ.288 చెల్లించాల్సి ఉంటుందన్నారు. రూ.15వేలు విలువ చేసే పశువుకు రైతు వాటాగా రూ.144 చెల్లించాల్సి ఉంటుందన్నారు. గతంలో రైతులు 20 శాతం చెల్లిస్తే కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు 80శాతం ప్రీమియం చెల్లించేవన్నారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 85శాతం ప్రీమియం చెల్లిస్తున్నాయని, పాడి రైతులు కేవలం 15శాతం మాత్రమే చెల్లించాల్సి ఉందన్నారు. ఏడాదిలో పశువుకు ఏదైనా ప్రమాదం జరిగితే ప్రభుత్వం నుంచి బీమా సొమ్ము రైతుకు చెల్లిస్తారన్నారు. కావున ఈ అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. వివరాలకు స్థానిక పశు వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

అడ్మిషన్ల కౌన్సెలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - వేంపల్లె

రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయ పరిధిలోని ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్ఐటి 2025-26 విద్యా సంవత్సర ప్రవేశానికి సంబంధించి కౌన్సెలింగ్ ప్రక్రియకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మొదటి రోజు సోమవారం ఆర్కేవ్యాలీ క్యాంపస్‌లోని సెంట్రల్ లైబ్రరీలో 530 మంది విద్యార్థులకు కౌన్సిలింగ్ నిర్వహించనున్నారు. అందుకు సంబంధించి కొత్తగా వచ్చిన విద్యార్థులకు భోజనం, మౌలిక వసతులు తదితర ఏర్పాట్లు చేశారు. ముందుగా ట్రిపుల్ఐటి ముఖద్వారం వద్ద విద్యార్థులు టోకెన్ తీసుకొని సెంట్రల్ లైబ్రరీలో దరఖాస్తు పూర్తి చేసుకొని సర్టిఫికెట్లు వెరిఫికేషన్ ఉంటుంది. అనంతరం పదవ తరగతిలో పాసైన ఒరిజినల్ సర్టిఫికెట్లు, టీసీ, విద్యార్థి ఫోటోలు, తల్లిదండ్రుల ఫొటోలు తదితర వాటిని పొందుపరిచి అడ్మిషన్ పూర్తి చేస్తారు. జూలై 1న 530 మంది విద్యార్థులకు అడ్మిషన్లకు సంబంధించి కౌన్సిలింగ్ నిర్వహిస్తారు. జూలై 15 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి.

ఉద్యోగికి విరమణ సాధారణం

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ సర్వసాధారణమని, అంకితభావంతో విధులు నిర్వర్తించినప్పుడే మంచి పేరు గడిస్తారని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఆర్ఇఎస్‌వి జూనియర్ కళాశాలలో పరిపాలన అధికారి వెంకట్‌రెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు అధ్యాపకులు, ముఖ్యఅతిథులు మాట్లాడారు. ప్రజలకు మంచి చేసినప్పుడే చిరకాలం గుర్తుండి పోతారని అన్నారు. అనంతరం వెంకటరెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

'మానవత' నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

మానవత స్వచ్ఛంద సంస్థ సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం స్థానిక మానవత స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో రిటైర్డ్ ఎంఇఒ సదాశివారెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. నూతన అధ్యక్షుడిగా జి.చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ముక్కోటి వెంకట శేషయ్య, కోశాధికారిగా బండి హరిశ్చంద్రారెడ్డి, ఉపాధ్యక్ష ఇతర కార్యవర్గ సభ్యులుగా సోమా పద్మావతి, వై శ్రీనివాసరెడ్డి, జి.నరేస్, బండి శివరామిరెడ్డి, పి.రాజేశ్వరరెడ్డి ఎన్నుకున్నారు. ఎన్నికైన వారితో సంస్థ చైర్మన్ డివి కొండారెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. ముఖ్యఅతిథులుగా విచ్చేసిన జెడ్పిటిసి మాజీ సభ్యుడు పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి, సారెడ్డి చంద్రశేఖరరెడ్డి, ఇఎన్‌టి డాక్టర్ జస్మిత కొత్త కార్యవర్గాన్ని అభినందించారు.

పూడికతీత పనులు ముమ్మరం

ప్రజాశక్తి - ఖాజీపేట

ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుండడంతో కెసి కాలువల్లో పూడిక తీత పనులు ముమ్మరం చేశారు. అధికారులు, నీటి సంఘం అధ్యక్షులు ప్రత్యేకదృష్టి సారించారు. కాలువలు వెంబడి ఉన్న కంపచెట్లు తొలగించడం, పూడికతీత పనులకు శ్రీకారం చుట్టారు. గురువారం మండల పరిధిలోని భూమాయపల్లె, శ్రీనివాసపురం ప్రాంతాలలో కెసి కాలువల వెంబడి ఉన్న కంపచెట్లను 12వ నెంబర్ కెసి కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఉపాధ్యక్షులు తుంగా చెంద్రాయుడు, గోగు శేఖర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటసుబ్బయ్య తొలగింపజేస్తూ పర్యవేక్షిస్తున్నారు. చాలా ఏళ్ల తర్వాత ఉప కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఎకరాకు నీరు అందేలా చర్యలు తీసుకుంటామని వారన్నారు.



పూడికతీత, కాలువల వెంబడి ఉన్న కంపచెట్లు తొలగిస్తున్న జెసిబి యంత్రం

మార్కెట్ యార్డు సేవలను సద్వినియోగం చేసుకోవాలి



నాయబ్ రసూల్‌ను సన్మానిస్తున్న ముస్లిం మైనార్టీ, టిడిపి నాయకులు

ప్రజాశక్తి - చాపాడు

రైతులు మార్కెట్ యార్డ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మైదుకూరు యార్డ్ వైస్ చైర్మన్ కె.నాయబ్ రసూల్ తెలిపారు. ఆదివారం ఖాదర్‌పల్లి గ్రామంలో ప్రజా సేవా సమితి ఆధ్వర్యంలో మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ నాయబ్ రసూల్‌ను నియమించడం పట్ల సన్మాన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాయబ్ రసూల్ మాట్లాడుతూ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ సహకారంతో మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టానని తెలిపారు. గతంలో చాపాడు మండలం ప్రొద్దుటూరు మార్కెట్ యార్డ్ పరిధిలో ఉండగా మైదుకూరు నియోజకవర్గంలోని అన్ని మండలాలను ఒకటిగా చేశారన్నారు. ముస్లిం మైనార్టీలకు వైస్ చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించడం సంతోషమన్నారు. రైతులు మార్కెట్ యార్డ్ పరిధిలో ఉన్న మూడు గోడౌన్లలో వరి ధాన్యాన్ని బస్తాకు కేవలం రూ.3తో నిలువ ఉంచుకోవచ్చున్నారు. మరిన్ని సేవలను రైతులకు అందించేందుకు కృషి చేస్తామన్నారు. టిడిపి నాయకులు ప్రభాకర్‌రెడ్డి, అక్బర్ వల్లి, నారాయణరెడ్డి, రజనీకాంత్, ఇస్మాయిల్, ప్రజా సేవ సమితి నిర్వాహకులు అయూబ్, సలీం, ప్రజలు పాల్గొన్నారు.

పిబిసి లిఫ్టు పనులకు మోక్షం లేదా..!

2009 నుంచి ఆగిపోయిన పనులు-కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది అవుతున్నా పట్టని పాలకులు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

పులివెందుల నియోజకవర్గానికి ప్రధాన సాగునీటి వనరైన పులి వెందుల బ్రాంచ్ కెనాల్(పిబిసి) లిఫ్టు పనులకు మోక్షం లభించకపోవడం పట్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పులివెందుల, సింహాద్రిపురం, తొండూరు, వేముల, వేంపల్లి మండలాల పరిధిలో 54 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేలా రూపకల్పన చేశారు. దీంతోపాటు మరింత విస్తీర్ణంలో భూమికి నీటి తడులు అందించాలనే లక్ష్యంతో 2008లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్‌కు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. అందులో భాగంగానే పులివెందుల బ్రాంచ్ కెనాల్ పరిధిలో దాదాపు 19 లిఫ్టులు ఏర్పాటు చేశారు. వీటిలో చాలావరకు పనులు పూర్తి కాకపోవడంతో నేటికీ అర్ధంతరంగా నిలిచిపోయాయి.



నీటి లిఫ్టు కోసం ఏర్పాటు చేసిన పంప్ హౌస్

93వ ప్యాకేజీలో ఆగిపోయిన పనులు..

లిఫ్ట్ పనులకు సంబంధించి పనులు పొందిన రత్నా కన్‌స్ట్రక్షన్ కేవలం లాభసాటి పనులు మాత్రమే చేసి మిగిలిన పనులను వదిలేసింది. ఈ ప్యాకేజీ పరిధిలోని ఎల్లనూరు మండలం వెంకటం పల్లి సమీపంలో ఏర్పాటు చేసిన లిఫ్ట్ పనులు నిలిచిపోయాయి. దీని పరిధిలో 1000 ఎకరాలకు సాగునీరు అందించేలా రూపకల్పన చేశారు. ఇందుకు సంబంధించి దాదాపు రూ.4.5 కోట్ల వ్యయంతో పనులు చేపట్టారు. పంప్ హౌస్, 24 గంటలు విద్యుత్ అందించేలా విద్యుత్ సరఫరా పనులు పూర్తి చేశారు. మోటర్లు ఏర్పాటుతోపాటు పైపులైన్ పనులు నిలిచిపోయాయి. ఈ కారణంగా కొత్తగా ఆయకట్టు పరిధిలోకి తీసుకురావాల్సిన 1000 ఎకరాలకు నేటికీ నీటి తడులు అందకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడు తున్నారు.

కూటమి ప్రభుత్వంపై రైతుల ఆశలు..

గత ప్రభుత్వాలు లిఫ్ట్ ఇరిగేషన్ పనులపై దృష్టి సారించకపోవడం పట్ల తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వమైన పెండింగ్‌లో ఉన్న లిఫ్ట్ పనులకు నిధులు కేటాయించి పూర్తిచేయాలని రైతులు కోరుతున్నారు. కృష్ణా జలాలతో నియోజకవర్గంలోని పార్లపల్లె సమీపంలోని చిత్రావతి రిజర్వాయర్‌లో పది టీఎంసీల నీటిని, పైడిపాలెం సమీపంలో ఉన్న పైడిపాలెం రిజర్వాయర్‌లో 6 టీఎంసీల నీటిని నిండుగా నింపారు. ఫలితంగా కాలువలలో నిరంతరాయంగా రైతుల అవసరాల మేరకు నీటిని విడుదల చేస్తున్నారు. అయితే కాలువకు దూరాన ఉన్న రైతులు తమ పండ్ల తోటలకు నీటి తడులు అందించేందుకు భారీ పెట్టుబడులు పెట్టి పివిసి పైపులతో లైన్లు వేసుకుంటున్నారు. లిఫ్ట్ పనులు పూర్తయితే ఇలాంటి కష్టాలు ఉండవని రైతులు చెబుతున్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి..

లిఫ్ట్ పనులను త్వరగా పూర్తి చేసి ఆయకట్టుకు నీటిని విడుదల చేయాలి. గతంలో అనేకమార్లు అధికారుల దృష్టికి తీసుకొచ్చినప్పటికీ పనులు పూర్తి చేయలేదు. పండ్ల తోటలకు నీటి తడులు అందించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కూటమి ప్రభుత్వం స్పందించి నిధులు కేటాయించి పనులు పూర్తి చేయాలి. **- సత్యంరెడ్డి, రైతు, గురజాల**



అలంకార ప్రాణంగా మారిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

టిడిపి సమీక్షకు హాజరైన 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : మంగళగిరి టిడిపి కేంద్ర కార్యాలయంలో "సుపరిపాలనలో తొలి అడుగు, ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టిన సమావేశానికి రాజంపేట పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజు హాజరయ్యారు. జూలై 2 నుంచి ప్రతి ఇంటికి, ప్రజలకు దగ్గరయ్యే విధంగా కూటమి ప్రభుత్వంలో ఏడాదిలో చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు మరియు సంక్షేమ పథకాల గురించి, ప్రభుత్వం అమలు చేస్తున్న మెగా డిఎస్‌సి, పింఛన్లు, ఇండ్లు, గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఆగస్టు 15వ తేదీన మహిళలకు ఆర్‌టిసి బస్సులో ఉచిత ప్రయాణం వంటి ఇంకా మరెన్నో పథకాలను వివరిస్తూ ప్రజల్లోకి వెళ్లాలని సూచనల మేరకు మన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు టిడిపి ముఖ్య నేతలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రులకు, ఎంపీలకు, ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జిలకు దిశా నిర్దేశం చేయడం జరిగిందని చమర్తి తెలిపారు.

నిరంతర కృషితోనే ప్రాజెక్టుల పనులు పూర్తి

- వృత్తి జీవితంలో ఐదు లక్షల ఎకరాలకు సాగునీటిని అందించా
- అదే నాకు అంతులేని సంతృప్తి
- రాష్ట్ర నీటిపారుదలశాఖ చీఫ్ ఇంజినీర్ ఎం.మల్లికార్జునరెడ్డి



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

పట్టుదల, అంకురితదీక్ష, నిరంతరకృషి, అంతులేని ఆత్మవిశ్వాసంతో కృషి చేయడం ద్వారానే పెండింగ్ ప్రాజెక్టు పనులు పూర్తి చేయగలమని రాష్ట్ర నీటిపారుదలశాఖ చీఫ్ ఇంజినీర్ (హెచ్‌ఆర్‌డి) ఎం.మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. ఈనెల 30న ఉద్యోగ విరమణ చేయనున్న సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ 1963లో ఉమ్మడి కడప జిల్లా వీరబల్లి మండల కేంద్రంలో జన్మించానన్నారు. ఒకటవ తరగతి నుంచి ఎంటెక్ వరకు కడప, చిత్తూరు, మదనపల్లి పట్ట ణాల్లో విద్యను అభ్యసించానని పేర్కొన్నారు. 1988 సంవత్సరంలో ఎపిపిఎస్‌సి పరీక్ష రాసి కర్నూలు జిల్లా నంద్యాల నీటిపారుదలశాఖలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా నియమి తులయ్యానని చెప్పారు. తన ఉద్యోగ జీవితంలో ఎఇఇ నుంచి డిఇఇ, ఇఇ, ఎస్ఇ, సిఇ వంటి ఉన్నత స్థాయి హోదాలలో కీలక ఇంజినీరింగ్ బాధ్యతలు చేపట్టానని, 2009 నుంచి 2014 వరకు కర్నూలు జిల్లాలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా విధులు నిర్వహిం చానని వెల్లడించారు. 2015 నుంచి 2021 వరకు అనంతపురం జిల్లాలో ఎగ్జిక్యూటివ్‌ఇంజినీర్, సూప రింటెండింగ్ ఇంజినీర్‌గా పని చేశానన్నారు. 2021 నుంచి 2025 వరకు కడప జిల్లా జిఎన్ఎస్ఎస్ సూపరింటెండింగ్ ఇంజినీర్, చీఫ్‌ఇంజినీర్‌గా విధులు నిర్వర్తించానని చెప్పారు. అనంతరం చీఫ్ ఇంజినీర్‌గా తిరుపతికి బదిలీపై వెళ్లాలని పేర్కొన్నారు. తరువాత 2025లో విజయవాడలోని జలసౌదలో చీఫ్ ఇంజినీర్ (హెచ్‌ఆర్‌డి) బాధ్యతలు చేపట్టానని తెలియజేశారు. తన 37 ఏళ్ల ఉద్యోగ జీవితంలో గ్రేటర్ రాయలసీమ జిల్లాలైన కడప, కర్నూలు, అనంతపురం, చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో సమర్థవంతంగా విధులు నిర్వహించాన న్నారు. కెసి కెనాల్, తెలు గు గంగ ప్రాజెక్టు, గండి కోట, పిబిసి, వామికొండ, సర్వ రాయసాగర్, బ్రహ్మం సాగర్, మైలవరం, చిత్రావతి, కుప్పం, పుంగనూరు బ్రాంచి కెనాల్స్, హంద్రీ-నీవా, కాలేటివాగు, వెలిగలు ప్రాజెక్టు, కర్నూలు జిల్లాలోని ముచ్చుమర్రి లిఫ్ట్‌స్కీమ్, నెల్లూరు జిల్లాలో సోమశిల, పెన్నా, డెల్టా, కండలేరు ప్రాజెక్టులు సహా పలు మేజర్ ప్రాజెక్టుల్లో పెండింగ్ పనులు పూర్తి చేయడంలో తనదైన పాత్ర పోషించానని తెలిపారు. పైన పేర్కొన్న ప్రాజెక్టుల పరిధిలోని ఐదు లక్షల ఎకరాలకు సాగు నీటిని అందించానన్నారు. తన వృత్తి జీవితంలో ఐదు లక్షల ఎకరాలకు సాగునీటిని అందించడం అంతులేని తృప్తిని కలిగించిందని చెప్పారు. దీంతోపాటు ఇంజినీరింగ్ విభాగంలో డిజైన్స్‌కు సంబంధించి, టన్నెల్స్, స్ట్రక్చర్స్, లిఫ్ట్ స్కీములు, కెనాల్స్, డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థల రూపకల్పన చేసి సాగునీటిని అందించడానికి కృషి చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర నీటి పారుదలశాఖ ఇంజినీరింగ్ చరిత్రలో ఎన్నడూ ఎరుగని రీతిలో రూ.2,700 కోట్ల మేరకు నిర్మాణ పనులను రెండు సంవత్సరాల కాలంలో పూర్తి చేసిన ఘనత తనకు దక్కిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంజినీరింగ్ సేవలను గుర్తించి పలు ప్రశంసాపత్రాలను అంద జేసిందని తెలిపారు. తన 37 ఏళ్ల సుదీర్ఘ ఉద్యోగ జీవి తంలో రోజుకు 12 గంటలపాటు శ్రమించానన్నారు. ఆయా జిల్లాల కలెక్టర్లు, రాజకీయ నాయకత్వం సహ కారం మరువలేనిదని కొనియాడారు. ఉద్యోగ విరమణ అనంతరం పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణ పనులకు తన వంతు ఇంజినీరింగ్ సేవల సహాయ సహకారాలను అందిస్తానని తెలిపారు. భవిష్యత్ యువ ఇంజినీర్లు పెండింగ్ ప్రాజెక్టులు, డిస్ట్రిబ్యూటరీ పనులు పూర్తి చేయడంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని సూచించారు.



రోడ్డు ప్రమాదం గురించి తెలుసుకుంటున్న ఎంపీ అవినాష్‌రెడ్డి

మానవత్వం చాటుకున్న ఎంపీ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తులను ఆసుపత్రికి తరలించి కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి మానవత్వాన్ని చాటుకున్నారు. ఆదివారం సాయంత్రం పట్టణంలోని స్థానిక జేఎన్టీయూ కాలేజీ సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. తొండూరు మండలం కృష్ణంగారి పల్లె నుంచి పాల ఆటో పులివెందులకు వస్తుండగా జేఎన్టీయూ సమీపంలోకి రాగానే అక్కడ చెత్త కాగితాలు ఏరుకునే గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు దాటుతుండగా ఆ వ్యక్తిని ఆటో ఢీ కొట్టి పల్టీ కొట్టింది. కాగితాలు ఏరుకునే గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా.. ఆటోలో ప్రయాణిస్తున్న కృష్ణంగారిపల్లెకు చెందిన షబానా, శంషాద్ స్వల్పంగా గాయపడ్డారు. అదే ఆటోలో ప్రయాణిస్తున్న కృష్ణంగారిపల్లెకు చెందిన హనుమంత్‌రెడ్డికి నడుము భాగంలో గాయమై లేవలేని పరిస్థితిలో పడి ఉండగా.. ఆ సమయంలో అటువైపు పులివెందులకు వస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తన కాన్వాయ్‌ని ఆపి దిగి గాయపడిన హనుమంత్ రెడ్డిని పరామర్శించారు. అక్కడికి 108 వాహనం చేరుకోకపోవడంతో తన సెక్యూరిటీ వాహనం ద్వారా స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు.



ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలు

చిన్నపాటి అడవిని తలపిస్తున్న కార్యాలయాలు

- పట్టని అధికారులు, విషపురుగులుంటాయని ప్రజల్లో ఆందోళన

ప్రజాశక్తి - వేముల

వేముల మండల కేంద్ర కార్యాలయంలో భాగమైన స్థానిక సచివాలయం, రైతు సేవా కేంద్రం, హౌసింగ్, వ్యవసాయ అధికార కార్యాలయాల వద్ద చిన్నపాటి అడవిని తలపిస్తున్నట్లు పిచ్చి మొక్కలు, కంపచెట్లు దర్శనమిస్తున్నాయి. మండల వ్యాప్తంగా ప్రతి గ్రామంలో పరిశుభ్రతపై అవగాహన కల్పించే అధికారులు తమ కార్యాలయాల వద్దనే ఇలా ఉందని పలువురు ప్రశ్నిస్తున్నారు. నిత్యం వందల సంఖ్యలో ప్రజలు తమ సమస్యల నిమిత్తం ఆయా మండల కేంద్రాల వద్దకు వస్తూంటారు. ఈ క్రమంలో ఎంతోమందికి పిచ్చి మొక్కల వైపు ఎన్నో విష పురుగులు కూడా దర్శనం ఇవ్వడంతో భయభ్రాంతులకు గురైన రోజులు ఎన్నో ఉన్నాయి. ఈ విషయాలన్నీ అధికారులకు తెలిసినా కూడా వారు పట్టించుకున్న పాపానా పోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని రైతులు, ప్రజలు సూచిస్తున్నారు.

రెవెన్యూ అధికారులు వేధింపులు మానుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)



రైతులతో కలిసి మాట్లాడుతున్న ఎవి రమణ

వనిపెంట రైతుల పట్ల రెవెన్యూ అధికారుల వేధింపులు మానుకోవాలని రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షులు ఎవి రమణ కోరారు. ఆదివారం రైతులతో కలిసి ఆయన మాట్లాడుతూ మైదుకూరు-తాటిచెర్ల రోడ్డు వనిపెంట గ్రామం గుండా కాకుండా సమీపాన బైపాస్ నిర్మాణాన్ని రైతులు అడ్డుకున్న విషయం తెలిసిందే అన్నారు. రోడ్డు విషయమై రెవెన్యూ అధికారులు తీసుకున్న చర్యను వ్యతిరేకిస్తూ గత రెండు నెలల క్రితం రైతులు హైకోర్టులో తమకు న్యాయం చేయమని కేసు వేశారన్నారు. దీనిపై రెవెన్యూ అధికారులు సమాధానం తెలియజేయకుండా.. మైదుకూరు రెవెన్యూ అధికారులు వనిపెంట విఆర్ఒ రమణయ్య ద్వారా ఆ రైతులకు హైకోర్టులో వేసిన కేసు రిజిస్టర్ అయిన పది రోజుల ముందు తేదీలతో నోటీసులు తయారు చేసి అందజేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. రైతులకు అన్యాయం చేసే ఈ ప్రయత్నాన్ని మానుకోకపోతే రెవెన్యూ అధికారులు చేసే దౌర్జన్యాలు, వేధింపుల వల్ల ఏ ఒక్క రైతుకు హాని జరిగినా రెవెన్యూ అధికారులే బాధ్యత వహించవలసి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మైదుకూరు నియోజకవర్గ కార్యదర్శి మాడిశెట్టి సహదేవ్, మైదుకూరు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కటారు వీరన్న, రైతులు భూమిరెడ్డి శ్రీనివాసులు, శివగుప్తా, మరాఠీ వెంకయ్య, కత్వల్ సాదక్, బాల నరసింహారెడ్డి, రామచంద్రారెడ్డి, కోటయ్యగారి మురళి, పోలయ్య, రైతు సేవా సమితి నాయకుడు రామ్మోహన్, తోట వెంకటయ్య పాల్గొన్నారు.

ఉచితంగా వైద్య పరీక్షలు, మందులు పంపిణీ



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సుమిత్ర

ప్రజాశక్తి - ముద్దనూరు

స్థానిక సుచరిత నర్సింగ్ హోంలో ఆదివారం డాక్టర్ స్రవంతి ఆధ్వర్యంలో ప్రొద్దుటూరుకు చెందిన వీర గాయత్రి హాస్పిటల్ వారు ఉచిత ఫర్టిలిటీ శిబిరం నిర్వ హించారు. డాక్టర్ కందుల సు మిత్ర మహిళలు, గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సూచనలు చేశారు. మందులు ఉచితంగా అందజేశారు.

విగ్రహాలు పగులగొట్టడం దారుణం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

అంబేద్కర్ జిల్లాలో రాజ్యాంగాన్ని రచించిన వ్యక్తి మీద చెప్పుల దండలు వేయడం, విగ్రహాలను పగులగొట్టడం దారుణమని మాల మహానాడు జాతీయ మహిళ అధ్యక్షురాలు మంచ నాగమల్లేశ్వరి అన్నారు. ఆదివారం ఆమె రోడ్డు మార్గాన హైదరాబాద్‌కు వెళుతూ జిల్లా అధ్యక్షుడు భాస్కర్ ఆధ్వర్యంలో పాత బస్టాండ్ సర్కిల్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అంబేద్కర్ అంటే ఎస్సీ, ఎస్టీలకు మాత్రమే కాదు అందరికీ పూజ్యుడని తెలిపారు. అధికార మదంతో చేస్తున్న ఈ సంఘటనలను మాల మహానాడు ఖండిస్తోందన్నారు. అంబేద్కర్‌ని అవమానించి, కించపరిచిన వాళ్లు ఒళ్లు దగ్గర పెట్టుకొని నడుచుకోవాలని హెచ్చరించారు. అంబేద్కర్ ఆశయాలు, సిద్ధాంతాలతో తాము ముందుకు వెళుతున్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కడప జిల్లా యూత్ లీడర్ పందిటి రాజేష్, జిల్లా కార్యదర్శి సునీల్, ప్రొద్దుటూరు పట్టణ అధ్యక్షులు పవన్, ప్రొద్దుటూరు తాలూకా అధ్యక్షులు స్వరూప్ వీర కిరణ్ కుమార్, కళ్యాణ్‌బాబు, హ్యూమన్ రైట్స్, రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ ముత్యాల ప్రసాద్ రావు, హ్యూమన్ రైట్స్ వెంకటన్న, పలువురు దళిత నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంచ నాగ మల్లేశ్వరి